క్లుప్తంగా

చిన్నారులకు ఆధార్ నమోదు


తన కుమార్తెకు ఆధార్ నమోదు చేయిస్తున్న ఎస్ఐ నాగకార్తీక్

రోలుగుంట : చిన్నారులకు ఆధార్ నమోదు చేయించుకోవాల్సిందిగా ఆధార్ కేంద్ర నిర్వాహకుడు నాయుడు కోరారు. స్థానిక మీ సేవతో పాటు, గ్రామాల్లో కూడా ఐదేళ్లలోపు వయసున్న చిన్నారుల ఆధార్ నమోదు ప్రక్రియను గత మూడు మాసాలుగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బుధవారం రోలుగుంట గ్రామంలో నిర్వహించిన ఆధార్ శిబిరంలో స్థానిక ఎస్ఐ బి.నాగకార్తీక్ తన కుమార్తె ఆధార్ నమోదు చేయించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు నాయుడు మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో గత మూడు నెలల్లో 850 మంది చిన్నారుల ఆధార్ నమోదు చేసినట్టు వెల్లడించారు.

ఇంటర్ విద్యార్థులకు శిక్షణ


విద్యార్థులకు బోధిస్తున్న ప్రిన్సిపాల్ సహదేవుడు

రోలుగుంట : ఇంటర్ ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు స్థానిక జూనియర్ కళాశాలలో సమ్మర్ క్లాసులు ప్రారంభమయ్యాయి. ఈ నెల 20వరకూ తరగతులుంటాయన్నాని ప్రిన్సిపాల్ సహదేవుడు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో తప్పిన విద్యార్థుల కోసం ప్రభుత్వ ఆదేశాలతో సమ్మర్ క్లాసులు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. రోజూ ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకూ సంబంధిత సబ్జెక్టుల అధ్యాపకులతో ఈ బోధన తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

పెద్దేరులో పెరుగుతున్న నీటిమట్టం


పెద్దేరు జలాశయంలో పెరిగిన నీటి నిల్వలు

మాడుగుల రూరల్ : గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రావిపాలెం వద్ద పెద్దేరు జలాశయంలో నీటి మట్టం పెరిగింది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 137 మీటర్లు కాగా, బుధవారం నాటికి 131.40 మీటర్లకు చేరింది. జలాశయం పరిసరాలల్లో 36 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు 17 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి చేరుతోందన్నారు.

ఘనంగా షిర్డీసాయి మందిర వార్షికోత్సవం


మాడుగులలో షిర్డీ సాయిని దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల : నియోజకవర్గ కేంద్రం మాడుగులలో షిర్డీసాయి మందిర 24వ వార్షికోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు, సత్యవ్రతాల్లో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సాయంకాలం పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనాదు శ్రీనివాసరావు, ఆలయ కమిటీ అధ్యక్షులు ఉష, మద్దులు సత్యనారాయణ, సమ్మంగి జగన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

రావికమతం : రావికమతం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఏడీఈ సురేష్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రావికమతంలో బ్రేకర్స్ మరమ్మతులు, సబ్‌స్టేషన్ అప్‌గ్రెడేషన్ చేయనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధి ప్రజలు దీన్ని గమనించి, సహకరించాల్సిందిగా కోరారు.

నూతన పింఛన్ల పంపిణీ

తమ పర భేదాల్లేవు. అర్హత ఉంటే చాలు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంటికే చేరతాయి. గతంలో మాదిరి ఎవరైనా చనిపోతే తప్ప, పింఛన్ మంజూరయ్యే పరిస్థితి కాదు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి నెలా అర్హులైన వారికి కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్నారు.


ఎ.వీరనారాయణంలో నూతన పింఛన్లు అందిస్తున్న ఎంపీటీసీ కృష్ణందొర

మాడుగుల రూరల్ : అవురువాడ వీరనారాయణం గ్రామ పంచాయితీకి కొత్తగా మంజూరైన పింఛన్లను బుధవారం లబ్ధిదార్లకు పంపిణీ చేశారు. స్థానిక ఎంపీటీసీ సభ్యులు చదల కృష్ణందొర, మాజీ సర్పంచ్ కిముడు త్రిమూర్తులుదొర(కోటి) చేతుల మీదుగా ఆరుగురు లబ్ధిదార్లకు పింఛన్ నగదు అందించారు.


కె.ఎం.పాలెంలో పింఛన్లు అందిస్తున్న సర్పంచ్ గంధం రామకృష్ణ, ఉప సర్పంచ్ సాంబశివరావు

దేవరాపల్లి : మండలంలోని కె.ఎం.పాలెం పంచాయతీలో నూతనంగా మంజూరైన పింఛన్లను స్థానిక సర్పంచ్ గంధం రామకృష్ణ, ఉప సర్పంచ్ యండపల్లి సాంబశివరావు బుధవారం లబ్ధిదారులకు అందించారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ప్రత్యేక చొరవతో పంచాయతీలో 19 మందికి వైఎస్సార్ పింఛన్ కానుక పథకంలో నూతన పింఛన్లతోపాటు, అభయ హస్తం పింఛన్లు మంజూరైనట్టు తెలిపారు. కె.ఎం.పాలెం, యండపల్లిపాలెం గ్రామాలలో లబ్ధిదారులకు పింఛన్ నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బన్నీ, పంచాయతీ కార్యదర్శి ఎస్.సింహచలం తదితరులు పాల్గొన్నారు.


ఎ.భీమవరంలో లబ్ధిదారులకు పింఛన్ నగదును అందిస్తున్న వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ శేషు

కె.కోటపాడు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తామని ఎ.భీమవరం వైఎస్సార్‌సీపీ కన్వీనర్ తగ్రా శేషు అన్నారు. గ్రామంలో అర్హులైన 9 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. ఈ పింఛన్లను లబ్ధిదారులకు బుధవారం అందించారు. సీఎం జగన్ వివక్షకు తావులేకుండా సంక్షేమ పాలన అందిస్తున్నారని కొనియాడారు. అర్హులైన వారు సమీప సచివాలయాల్లో తమ పేర్లను నమోదు చేసుకుంటే చాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తాడి రమణ, పాల సంఘం అధ్యక్షుడు తాడి శ్రీనివాసరావు, తగ్రా మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి శ్రీకారం

వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజారావు ఆదర్శం


భూమిపూజ చేస్తున్న రాజారావు, స్థానిక నాయకులు

రావికమతం : మేజర్ పంచాయితీ కొత్తకోట మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బేతా రాజారావు, అప్పలరాజు దంపతులు రూ.5 లక్షలతో గ్రామంలోని ప్రధాన శ్మశాన వాటిక అభివృద్ధికి ముందుకు వచ్చారు. ఈ మేరకు బుధవారం సర్పంచ్ కోన లోవరాజు, జెడ్పీటీసీ భర్త తలారి ఆదిమూర్తి, ఎంపీటీసీ పూడి దేవాతో కలిసి బుధవారం భూమిపూజ చేశారు. ప్రకాష్‌నగర్‌కు సమీపంలో ఉన్న శ్మశాన వాటిక అధ్వానంగా ఉంది. సరైన రహదారి లేదు. 10 అడుగుల రహదారి సర్పానది ఉధృతికి కొట్టుకుపోయింది. అంతిమ యాత్రలో పాల్గొనే వారు పాడిని మోస్తూ మోకాలలోతు నీటిలో ప్రయాసపడి వెళ్లాల్సి వస్తోంది. ఈ ఇబ్బందులను గమనించిన రాజారావు దంపతులు రహదారి నిర్మాణంతోపాటు, వరద ఉధృతికి కొట్టుకుపోకుండా 60 మీటర్ల మేర రిటైనింగ్ వాల్, సీసీ ర్యాంప్ నిర్మాణానికి ముందుకొచ్చారు. శ్మశాన వాటికలో బోరు వేయించి, మోటారు సౌకర్యం కూడా ఏర్పాటు చేయనున్నారు. శ్మశాన వాటిక అభివృద్ధికి శ్రీకారం చుట్టిన బేతా కుటుంబాన్ని గ్రామ పెద్దలు అభినందించారు. రాజారావు దంపతులు ఆరు మాసాల క్రితం రూ.3 లక్షల విలువైన స్థలాన్ని రహదారి నిమిత్తం గ్రామానికి అందించి, పలువురికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

మాడుగుల రూరల్ : మాడుగుల శాఖా గ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు గ్రంథాలయాధికారి వై.వెంకటేశ్వర్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం వచ్చే నెల 11 వరకు కొనసాగుతుందన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కథలు చెప్పడం, పుస్తక పఠనం, సమీక్షలు, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్స్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు ఉంటాయన్నారు. విద్యార్థు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని, సృజనాత్మకతను పెంచుకునేలా తల్లితండ్రులు ప్రోత్సహించాలని కోరారు.

వైభవంగా మోదకొండమ్మ పండగ రాట


సతకంపట్టు వద్ద పండగరాటలో ఆలయ కమిటీ చైర్మన్ అప్పలరాజు, ఎంపీపీ రామధర్మజ

మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ పండగరాట మహోత్సవం మహరాజులుకోట ఆవరణలో ఉన్న సతకంపట్టు వద్ద బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. రాట అనంతరం చలువ పందిళ్లు వేసి, ఈ నెల 9న అమ్మవారి కొలువు ఏర్పాటు చేయనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉపసర్పంచ్ శ్రీనాదు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాస్తారోకో


ఎ.కోడూరు రాస్తారోకోలో సీపీఎం నాయకుడు దేముడు

కె.కోటపాడు : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలని సీపీఎం మండల నాయకుడు యర్రా దేముడు డిమాండ్ చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎ.కోడూరులో రైతులతో కలిసి బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని బీజేపీ మినహా అన్ని పార్టీలు వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఉక్కు ఉద్యమానికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శి వనుము సూర్యనారాయణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


నర్సీపట్నంలో వామపక్ష నేతల ధర్నా

నర్సీపట్నం : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ వామపక్ష పార్టీ నాయకులు స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం జిల్లా నాయకులు మాకిరెడ్డి రామునాయుడు, డి.సత్తిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను అమ్మడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వారంతా రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

'ఎయిర్‌పోర్ట్‌కు అల్లూరి పేరు పెట్టాలి'

నర్సీపట్నం : భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం అభినందనీయమని నర్సీపట్నం క్షత్రియ పరిషత్ అధ్యక్షులు మంతెన శ్రీరామరాజు అన్నారు. బుధవారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ ఎయిర్‌పోర్ట్‌కు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టి, ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కోరిక తీర్చాలని ప్రభుత్వాన్ని కోరారు.

దుర్గాలమ్మ ఆలయ మండపానికి భూమి పూజ


మండప నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

చీడికాడ : మండలంలోని దండిసురవరం దుర్గాలమ్మ గుడి మండప నిర్మాణానికి బుధవారం ఎంపీపీ కురచా జయమ్మ, సర్పంచ్ కోన అర్జున చేతుల మీదుగా బుధవారం భూమిపూజ చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ గ్రామస్తులంతా కలిసి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును కలిసి దుర్గాలమ్మ గుడి మండప నిర్మాణానికి సాయం కోరినట్టు తెలిపారు. స్పందించిన డిప్యూటీ సీఎం రూ.5 లక్షలు మంజూరు చేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షులు యర్రా అప్పారావు, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతికొండబాబు, మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, యూత్ అధ్యక్షుడు స్వామినాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ ఈర్లె చైతన్య తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

కె.కోటపాడు : కె.కోటపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.శచీదేవి బుధవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అధ్యక్షతన సమావేశం జరగనుందన్నారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరుకావాల్సిందిగా కోరారు.

ఘనంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం


పి.ఎన్.ఆర్ పేటలో దుర్గాదేవి విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న గ్రామ ప్రజలు

యలమంచిలి : మండలంలో పి.ఎన్.ఆర్‌పేట, పేట బయ్యవరం గ్రామాల్లో శ్రీశ్రీశ్రీ దుర్గాదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. రెండు గ్రామాల ప్రజల ఆర్థిక సహాయంతో నూతనంగా దుర్గాదేవి ఆలయాల నిర్మాణం పూర్తి చేసుకుని ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు అమ్మవారి ఆలయం వద్ద విశేష పూజలు నిర్వహించారు. వైభవంగా విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. బుధవారం సాయంత్రం రెండు గ్రామాల పురవీధుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని, అమ్మవారి పాదాలు, కిరీటం, గరగలు మహిళలు ఊరేగించారు. ఆలయాన్ని పూలతో అలంకరించారు. ఆయా కార్యక్రమాల్లో గొన్నాబత్తుల శివలక్ష్మి, శివ, మొగలపల్లి వెంకట సత్యనారాయణ, గోవిందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖర్, నారాయణ రావు, జెర్రిపోతుల వెంకట్ పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి చర్యలు

మునగపాక : చెరువులను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని సంపదతయారీ కేంద్రాల జిల్లా కో–ఆర్డినేటర్ నాగలక్ష్మి అన్నారు. చెరువులను సుందరంగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మండలంలోని నాగులాపల్లిలో అభివృద్ధి చేయనున్న చెరువును ఆమె బుధవారం పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న చెరువు చుట్టూ అభివృద్ధి చేసేందుకు పాలకవర్గం, అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈవోఆర్డీ ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలతో అదనపు ఆదాయం


అరబుపాలెంలో పర్యటిస్తున్న డీపీవో శిరీషారాణి

మునగపాక : సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి అన్నారు. మండలంలోని అరబుపాలెంలో ఆమె బుధవారం పర్యటించారు. సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పం శతశాతం అమలు జరిగేలా చూడాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సంపద తయారీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు.

వినాయకుడు, శ్రీకృష్ణుడు విగ్రహాల ప్రతిష్ట

రాంబిల్లి: అప్పన్నపాలెంలో బుధవారం వినాయకుడు, శ్రీకృష్ణుడు విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇక్కడ గల ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో వినాయకుడు, శ్రీకృష్ణుడి విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కోలాటాలు ఎంతో ఆకట్టుకున్నాయి. సర్పంచ్ రుత్తల పైడిరత్నం, ఎంపీటీసీ లాలం చినసత్యం, గ్రామ నాయకులు రుత్తల గణేష్ పాల్గొన్నారు.

కేజీబీవీలో ఇంటర్ ప్రత్యేక తరగతులు

మాడుగుల : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు బుధవారం నుంచి ప్రత్యేక తరగతులు ప్రాంభించినట్టు ఎస్‌వో విజయ తెలిపారు. ఈ కేంద్రంలో వి.మాడుగుల, సబ్బవరం, బుచ్చెయ్యపేట, రావికమతం మండలాలకు చెందిన ఇంటర్ తప్పిన కేజీబీవీ విద్యార్థులు 105 మందికి ఈ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. పరీక్షలు ముగిసేవరకు ఉచిత భోజన వసతితో బోధన కొనసాగుతుందన్నారు.

పాడిరైతుల సంక్షేమమే లక్ష్యం

మాకవరపాలెం : పాడిరైతుల సంక్షేమమే విశాఖ డెయిరీ లక్ష్యమని డెయిరీ డైరెక్టర్ ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. మండలంలోని లచ్చన్నపాలెంలో బుధవారం పాడిరైతులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పాల ఉత్పత్తిని పెంచేందుకు కృషి చేయాలన్నారు. బోర్లు, పశువుల షెడ్ల నిర్మాణం, పశువుల కొనుగోలుకు వడ్డీలేని రుణాలను డెయిరీ ద్వారా అందించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, ఏరియా మేనేజర్ సత్యనారాయణ, పాల సంఘం అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

పొంగలిపాకలో ఫ్యామిలీ డాక్టర్


పొంగలిపాకలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యాధికారి మాలంనాయుడు

మాడుగుల రూరల్ : కింతలి పీహెచ్‌సీ పరిధి పొంగలిపాకలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కె.మాలంనాయుడు 53 మందిని పరీక్షించారు. బీపీ, సుగర్ స్థాయిల్ని పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు అవసరమైన వైద్య సేవలు అందించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల్ని పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలకు మెరుగైన వైద్య సేవలందించాలన్న లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు జి.ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఏఎన్ఎం విమల, ఆరోగ్య సహాయకుడు రాజుతో పాటు ఆశ కార్యకర్త తులసి పాల్గొన్నారు.

రెండో రోజూ భారీ వానలు


మాకవరపాలెంలో కురుస్తున్న వర్షం


వర్షపు నీటిలో ఏఎల్ పురం పాఠశాల

మాకవరపాలెం : మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలపై మెట్టప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి అధికంగా ఎండకాస్తూ మధ్యాహ్నం వర్షం కురుస్తోంది. బుధవారం కూడా మధ్యాహ్నం గంటపాటు భారీ వర్షం కురిసింది. వేసవి దుక్కులకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు. ఏటా ఏప్రిల్, మే నెలల్లో వేసవి దుక్కులు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షం దుక్కులకు మేలు చేస్తుందని రైతులు చెప్తున్నారు. మరోవైపు ఎండకు ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు వాతావరణం చల్లబడి ఉపశమనం లభించింది.

వర్షాలకు తడిసిన వరి పంట


వి.వి.అగ్రహారంలో తడిసిన వరి పనలను ఎత్తుతున్న రైతులు

మాడుగుల రూరల్ : అకాల వర్షాలకు వరి పంట నీటమునిగింది. వి.వి.అగ్రహారం రెవెన్యూ పరిధిలో లక్ష్మీపురం ఆయకట్టులో ఇటీవల కోసిన వరి పంటను రైతులు ఒడ్డుకు చేర్చుతున్నారు. వారం రోజుల కిందట పండిన పంటను కోత కోసి, పనల్ని ఆరబెట్టారు. తాజాగా కురుస్తున్న భారీ వర్షాలకు పంట భూమిలోనే వరి పనలు తడిసి ముద్దయ్యాయి. బుధవారం కురిసిన భారీ వర్షానికి మరింతగా పంట నీటమునిగింది. తడిసిన పనల్ని గట్ల పైన, మెట్ట ప్రాంతాలకు తరలించి ఎండబెడుతున్నారు.

మండలంలో భారీ వర్షం

గొలుగొండ : మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఏఎల్ పురం, కొంకసింగి, చిన్నయ్యపాలెం, అమ్మపేట, కొత్తమల్లంపేట తదితర గ్రామాల్లో భారీ వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. ఈ వర్షం మెట్ట పంటలకు మేలు కలిగిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో దారగెడ్డ, బొడ్డేరు గెడ్డల్లో నీటి ప్రవాహం మొదలయింది.

రైతుల భూముల్ని పరిరక్షించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న గోవిందు

రావికమతం : గ్రానైట్ క్వారీ నిర్వాహకుల నుంచి జీడిమామిడి రైతుల భూముల్ని పరిరక్షించాలన్న డిమాండ్‌తో త్వరలో నిర్వహించనున్న సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవింద్ పిలుపునిచ్చారు. ఉర్లోవకొండ రెవెన్యూ పరిధిలోని 400 ఎకరాల్లో 350 మంది రైతులు ఏళ్ల తరబడి జీడిమామిడి సాగు చేస్తున్నారని తెలిపారు. ఎంఎస్ లక్ష్మీనరసింహ గ్రానైట్ క్వారీ నిర్వాహకులు తమకు ప్రభుత్వ అనుమతులున్నాయంటూ వారు పొందిన భూములతో పాటు రైతుల భూములనూ ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా క్వారీ నిర్వాహకులు వెనక్కి తగ్గకపోవడంతో, సత్యాగ్రహ దీక్ష చేసేందుకు ఆ ప్రాంత రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. గ్రానైట్ క్వారీ నిర్వాహకులు అనుమతులు పొందిన భూముల చుట్టూ కంచె వేసుకోవాలని, రైతుల భూముల జోలికి రావద్దంటూ హెచ్చరించారు. గోవిందుతో పాటు రైతులు లక్ష్మి, సాలం రాజిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికార సభ విజయవంతానికి పిలుపు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

నర్సీపట్నం : హైదరాబాద్‌లో జరిగే రాజ్యాధికార సభను విజయవంతం చేయాలని బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ బొట్టా నాగరాజు పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో రాజ్యాధికార సభ పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి బుధవారం ఆయన ఆవిష్కరించారు. యూపీ మాజీ ముఖ్యమంత్రి మాయావతి సభకు హాజరవుతున్నందున అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గంగాధర్, అప్పారావు, కుశరాజు తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛతో మానవ వికాసం

దేవరాపల్లి : ప్రజాస్వామ్యానికి పత్రికలు మూల స్తంభాలని, పత్రికా స్వేచ్ఛ మానవ వికాసానికి ఎంతో దోహదపడుతుందని దేవరాపల్లి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అన్నారు. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవరాపల్లి మండల పాత్రికేయులను ద్రోణంరాజు కల్యాణ మండపంలో సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, సర్పంచ్ మాట్లాడుతూ భావ ప్రకటనలో పత్రికా స్వేచ్ఛ అత్యంత ముఖ్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సబ్బవరపు మాలిబాబు, పంచాయతీ వార్డు సభ్యులు దీవి శంకర్, కొల్లి ఈశ్వరరావు, రేషన్ డీలర్ల అసోసియేషన్ మండల అధ్యక్షుడు వెత్సా రమేష్, పరవాడ రవి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు స్థల పరిశీలన


ఇళ్ల నిర్మాణాల కోసం స్థలం పరిశీలిస్తున్న గృహ నిర్మాణశాఖ అధికారులు

ఎస్.రాయవరం : ప్రభుత్వం ఇస్తున్న ఇళ్ల స్థలాలు లబ్ధిదారులకు నచ్చిన చోటే సిద్ధం చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని గృహ నిర్మాణశాఖ డీఈ విజేయుడు అన్నారు. కొరుప్రోలు గ్రామంలో ఒక లేఅవుటు శ్మశానవాటిక దగ్గరలో సిద్ధం చేయడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాలేదు. ఇటీవల జిల్లా కలెక్టర్ పర్యటనలో సమస్య కలెక్టర్ దృష్టికి వచ్చింది. దీంతో లబ్ధిదారులకు నచ్చిన చోటే లేఅవుటు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు అదే గ్రామంలో మరో లేఅవుట్‌కు అనుకుని ఉన్న స్థలాన్ని బుధవారం పరిశీలించారు. సర్పంచ్ కొరపాటి గోపాలం, మాజీ సర్పంచ్ పుట్టా సుధాకర్, గృహనిర్మాణశాఖ ఏఈ ప్రసాద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మహేశ్వరి పాల్గొన్నారు.